కాలువలో పూడిక తీయాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

నత్తలోవ మురుగుకాలువలో పూడిక తీయాలని కోరుతూ సరిపల్లిలో సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నత్తలోవ మురుగు కాలువ పరిధిలో రెండు వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తున్నారన్నారని చిన్నపాటి వర్షాలకే పంటలు ముంపునకు గురవుతున్నాయని, నేటికీ వరి చేల్లో మోకాల్లోతు నీరు ఉందని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల తూఫానుకు చెట్లు కాలువలో పడిపోయాయని తెలిపారు. కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు లాగకపోవడంతో కోతకొచ్చిన వరిచేల ఒబ్బిడికి వీల్లేకుండా ఉందన్నారు. కాలువలో పూడిక తీయకపోతే క్రాఫ్ హాలీడే ప్రకటిస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. అనంతరం సరిపల్లి నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టి దాసిరాజుకు వినతిపత్రం అందజేశారు. మంతెన రామరాజు, పిట్టా చిట్టిబాబు, ఎం.రత్నంరాజు, టి.సీతారామ కృష్ణ, మధుబాబు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం పర్యటన సందర్భంగా రాజవరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

మళ్లీ బారికేడ్ల పాలన..!

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పర్యటనలో పోలీసుల అడ్డుకట్టలు

గత వైసిపి ప్రభుత్వంలో ఇదే తీరుపై కూటమి నేతల విమర్శలు

ఐఎస్.జగన్నాథపురంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

ఆలయ విస్తరణకు 30 ఎకరాల భూమి కేటాయింపు

గుంతల రోడ్లపై గళమెత్తిన జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం

గత ప్రభుత్వ తరహాలోనే కూటమి ప్రభుత్వం సైతం బారికేడ్ల పాలనకు శ్రీకారం చుట్టిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం ద్వారకాతిరుమల మండలంలోని ఐఎస్.జగన్నాథపురంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పర్యటించారు. ఈ సందర్భంగా బందోబస్తు పేరుతో పోలీసులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లు చర్చనీయాంశమయ్యాయి. వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ పర్యటన సందర్భంగా బారికేడ్లు, పరదాలు వంటివి ఏర్పాటు చేయడంపై అప్పట్లో కూటమి నేతలు తీవ్ర విమర్శలు చేశారు. తాము అధికారంలోకి వస్తే పరదాలు, బారికేడ్ల పాలన ఉండదని, ప్రజలకు దగ్గరగా ఉంటామని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వమొచ్చి ఏడాదిన్నర గడిచినా ఇప్పటికీ బారికేడ్ల పాలనే సాగుతోంది. బందోబస్తు పేరుతో పోలీసులు చేస్తున్న అతి వ్యవహారంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు ఇలా చేస్తున్నారా అనే చర్చ సైతం సర్వత్రా సాగుతోంది. సిఎం, డిప్యూటీ సిఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. డిప్యూటీ సిఎం పర్యటన ఖరారైనప్పటికీ ఆదివారం రాత్రి పది గంటల వరకూ మీడియాకు సంబంధించి ఎటువంటి ఏర్పాట్లూ చేయని పరిస్థితి కన్పించింది. జిల్లా అధికారులు తమకు ఏమాత్రం సంబంధం లేదన్నట్లు వదిలేశారనే ఆరోపణలున్నాయి. ఎట్టకేలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పేషీ అధికారులు జోక్యం చేసుకుంటే తప్ప అధికారులు స్పందించని పరిస్థితి ఉంది.

మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గత పర్యటన సందర్భంగా ద్వారకాతిరుమల మండలం ఐఎస్.జగన్నాథపురం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన సందర్భంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆలయ ప్రదక్షిణ మండప నిర్మాణంతోపాటు గ్రామం నుంచి కొండపైకి వెళ్లేందుకు రోడ్డు నిర్మింపజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి అంశాన్ని మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లారు. అందుకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి రూ.8.7 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఆలయానికి అనుబంధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు 30 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఆ భూమి కేటాయింపునకు సంబంధించిన పత్రాలు పవన్ కళ్యాణ్ ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ స్థల పురాణం పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలువురి నుంచి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించి, వివరాలు తెలుసుకున్నారు. రెండోసారి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఐఎస్.జగన్నాథపురంలోని లక్ష్మినరసింహస్వామి ఆలయానికి విచ్చేశారు. ప్రత్యేక విమానంలో రాజమండ్రి చేరుకున్న ఆయన రోడ్డుమార్గం గుండా కొయ్యలగూడెం మండలం రాజవరం మీదుగా ఐఎస్.జగన్నాథపురం చేరుకున్నారు. ఆయనకు ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌తోపాటు ఎంఎల్‌ఎలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. రాజవరంలో కొంతదూరం వాహనం దిగి నడుచుకుంటూ ముందుకు సాగారు. జనం తాకిడి ఎక్కువ కావడంతో తిరిగి కారు ఎక్కి ఆలయానికి చేరుకున్నారు. ఆలయానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. రూ.3.5 కోట్లు దేవాదాయ శాఖ నిధులతో ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న ప్రదక్షణ మండపానికి, రూ.3.7 కోట్లతో ఆలయంపైకి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యాన పొంగుటూరు-లక్కవరం మధ్య గోతులమయంగా ఉన్న రహదారికి రూ.1.5 కోట్లతో మరమ్మతులు చేయించిన రహదారిని పరిశీలించారు. రాజవరం గ్రామంలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో పొలాల్లో పని చేసుకుంటున్న కూలీలను ఆప్యాయంగా పలకరించి, వారితో ఫొటోలు దిగారు. ఈ పర్యటనలో ఎంఎల్‌ఎలు మద్దిపాటి వెంకటరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, చిర్రి బాలరాజు, బడేటి చంటి, పులపర్తి రామాంజనేయులు, పత్సమట్ల ధర్మరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, జెసి అభిషేక్ గౌడ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆలయానికి భూముల పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

రోడ్ల సమస్యపై ఆందోళన చేపట్టిన వారిని చెదరగొడుతున్న పోలీసులు

గుంతల రోడ్లపై గళమెత్తిన జనం..

కొయ్యలగూడెం మండలంలోని తిమ్మనకుంట నుండి గంగన్నగూడెం, సీలింగులు, కృష్ణంపాలెం, గవరవరం వరకూ తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు అత్యంత దారుణంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు రాగా పోలీసులు అడ్డుకున్నారు. రాజవరం గ్రామ పంచాయతీ శివారు గంగవరం గ్రామస్తులు సుమారు కిలోమీటర్ మేర రోడ్డు అధ్వానంగా తయారైందంటూ పెద్దఎత్తున డిప్యూటీ సిఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. పోలీసులు వారినీ అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రోడ్డుపై వారు నిరసన తెలిపారు. పవన్‌కల్యాణ్ తిరుగు పర్యటనలో వీరి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. రోడ్డు వేయిస్తానని పవన్ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన దీక్ష

ప్రజాశక్తి - భీమవరం

కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎస్ఎ ఉద్యోగులు కదంతొక్కారు. సమస్యలతో వాగ్దానాలు అమలు చేసి ఖాళీలు భర్తీ చేసే జాబ్‌చార్ట్ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సర్వ శిక్ష ఉద్యోగుల జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భీమవరం కలెక్టరేట్ వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగులు సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.బాజీ, టి.జనార్దన్ మాట్లాడుతూ 22 రోజులు సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదన్నారు. నాటి ప్రతిపక్ష, ప్రస్తుత కూటమి ప్రభుత్వం శిబిరాల వద్దకు వచ్చి తాము అధికారంలోకి రాగానే ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని, జీతాలు పెంచుతామని వాగ్దానాలు చేసి విస్మరించిందన్నారు. ఒత్తిడిలో పని చేస్తున్నా ప్రభుత్వం కనికరం చూపించట్లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 10న ఎస్‌పిడి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా నాయకులు ఎం.నరేష్, ఆనంద్, కె.వాను, తాతయ్య, త్రిమోతి మాట్లాడుతూ 18 విభాగాల ఉద్యోగులు విపరీతమైన పని భారంతో పనిచేస్తున్నారన్నారు. ఖాళీలు భర్తీ చేయాలన్నారు. మహిళా నాయకులు రోహిణి, సంతోషి, మేరీ, కిరణ్మ మాట్లాడుతూ మహిళలకు చైల్డ్ కేర్ లీవులు లేవని, పిఎఫ్ ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడం ద్వారా కొంత ప్రయోజనం ఉంటుందని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, యూనియన్ గౌరవాధ్యక్షులు కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల వల్ల విద్యాశాఖ పనిచేస్తోందన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వంగా కార్మిక వ్యతిరేక నిర్ణయాన్ని లేబర్ కోడ్ అమలుకు పూనుకుందన్నారు. అసంఘటిత కార్మికులకు 15 సంవత్సరాల నుంచి కనీస వేతనాల్లో మార్పు లేదన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులకు అనేక హరిస్తుండగా ఉద్యోగాలను అమలు చేయడం లేదన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయడానికి బిజెపి, కూటమి ప్రభుత్వం చర్యలు తీవ్రతరం చేస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఐక్య ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఉద్యమానికి సిఐటియు పూర్తి అండదండలు ఇస్తుందన్నారు. మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ 8 గంటల పని కోసం అనేక పోరాటాలు జరిగాయన్నారు. ప్రభుత్వం పని గంటలు మార్పు చేయడం దారుణమన్నారు. సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. కొవ్వాడ శ్రీనివాస్, రాజు, రమేష్, సిహెచ్ శ్రీనివాస్, ప్రశాంతి, నాగ లక్ష్మి, శ్రావణి, నబిల్ మాట్లాడారు. ధర్నా ప్రాంతానికి డిఇఒ నారాయణ వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యూనియన్ నాయకత్వం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలు విన్నవించారు. న్యాయమైన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు.

డిఇఒకు, సర్వ శిక్ష అభియాన్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

వ్యవసాయ అభివృద్ధికే 'రైతన్న మీకోసం'

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - ఉండి

వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని దీనికోసం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లాలో మొట్టమొదటిగా చిలుకూరులో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ వ్యవసాయంపై ఆలోచన చేయాలన్నారు. ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించే దిశగా రైతన్న మీకోసం కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 24 నుండి 29వ తేదీ వరకూ చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారులు అభ్యుదయ రైతులను కలుపుకొని రైతుల ఇళ్లకు వెళ్లి సాగులో యాంత్రీకరణ వినియోగం వల్ల లాభం, పంట మార్పిడి, ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల కలిగే నష్టాలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తారన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు ధర అంశాలను విపులీకరిస్తూ కార్యాచరణను రూపొందించడం జరిగిందని రైతులు అవగాహన చేసుకుని ఆచరణలో ఉంచాలని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఒక యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని, మీ పంట ఎలా ఉంది, సమయానుకూలంగా ఏయే చర్యలు తీసుకోవాలి, పండిన పంట ధరలు ఏ విధంగా ఉన్నాయి, వేసిన పంట ఎప్పుడు కోతకు వస్తుంది తదితర వివరాలతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి మొదలు గ్రామ వ్యవసాయ అధికారి వరకూ అందరి సెల్ ఫోన్ నెంబర్లతో సహా యాప్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. సమస్యలుంటే జిల్లా యంత్రాంగం దృష్టి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. సర్పంచి ఎం.వెంకట సోమరాజు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ కలిదిండి రామ కృష్ణంరాజు, పాలకోడేరు రూరల్ బ్యాంక్ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు, టిడిపి గ్రామాధ్యక్షులు వేగేశ్న సత్యనారాయణ రాజు, ఆకివీడు వ్యవసాయ సహాయకులు ప్రతాప్ జీవన్, తహశీల్దార్ నాగార్జున పాల్గొన్నారు.

రైతన్న మీకోసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి ఎంఎల్ఎ రఘురామ కృష్ణరాజు

పిజిఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

వికలాంగురాలితో మాట్లాడుతున్న కలెక్టర్

వి జి ఆర్ ఎ స్ లో ప్రజల నుంచి అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు, సచివా లయ అధికారి వై.దోసిరెడ్డి, డిపిఒ ఎం.రామనాథరెడ్డి కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వరరావు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువు లోగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అధికారులు లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి వారు సంతృప్తి పడే విధంగా సమస్యలు పరిష్కరిం చాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబునల్ మెంబర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జిల్లాలో పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఎక్కడైనా బహిరంగంగా చెత్త తగలపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరందించేందుకు అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కలెక్టరేట్లో సోమవారం అందరికీ ఇళ్లు సర్వే, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, తల్లికి వందనం, ఇకెవైసి అంశాలపై కలెక్టర్ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అందరికీ ఇళ్లు సర్వేలో ఇప్పటి వరకు 2,206 మంది నమోదు చేసుకున్నారని, గతంలో ఇచ్చిన పట్టాలు తాలూకా 24,351 మంది కూడా ఈ సర్వేలో వచ్చేలా చేయాలన్నారు. మండల, జిల్లాస్థాయి అధికారులు పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర మౌలిక సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించాలన్నారు. జిల్లాలో ఎక్కడా బహిరంగంగా చెత్త తగలబెట్టకూడదన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఎంహెచ్ఒ జి.గీతాబాయి, అధికారులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నేతలు

గణపవరం మండలాన్ని పశ్చిమలో కొనసాగించాలి

అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం మండలాన్ని భీమవరంలోనే కొనసాగించాలని సోమవారం మండల అఖిల పక్ష నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సరిపల్లిలో రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ మండలంలో కొద్ది మంది స్వార్ధ పరులు తమ రాజకీయ మెరుగు కోసం ఏలూరులో కలపాలని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మండల ప్రజలకు, రైతులకు కావాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు భీమవరంలో ఉన్నాయని, గణపవరం మండలానికి దగ్గరగా ఉన్నది భీమవరం అని తెలిపారు. గణపవరాన్ని ఏలూరులో కలిపేతే సహించేది లేదన్నారు. అనంతరం తహశీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. అలాగే జనసేన నాయకత్వంలో అఖిలపక్షం సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతాంగ సమస్యలు, ప్రభుత్వాల బాధ్యతపై సెమినార్

27న ఉద్దరాజు రామం వర్ధంతి సందర్భంగా ఏర్పాటు

అఖిల భారత కిసాన్ సభకు ఆలిండియా అధ్యక్షులు అశోక్ దావలే హాజరు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్దరాజు రామం 31వ వర్ధంతి సందర్భంగా రైతాంగ సమస్యలు, ప్రభుత్వాల బాధ్యత అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ మంతెన సీతారాం, ట్రస్టు కార్యదర్శి బి.బలరాం, ట్రస్టు సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్దరాజు రామం జిల్లాలో, రాష్ట్రంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుల్లో ఒకరని తెలిపారు. జిల్లాలో, రాష్ట్రంలో రైతు ఉద్యమ నిర్మాతగా ఉన్నారని పేర్కొన్నారు. అఖిల భారత కిసాన్ సభకు ఆలిండియా అధ్యక్షులుగా పనిచేశారని తెలిపారు. 1957-62 వరకూ నర్సాపురం పార్లమెంట్ సభ్యునిగా పనిచేశారని తెలిపారు. సముద్రం పాలవుతున్న గోదావరి జలాల వినియోగానికి చక్కటి మార్గం చూపారని తెలిపారు. ఉద్దరాజు రామం 31వ వర్ధంతి సందర్భంగా ఈ సెమినార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సెమినార్‌కు ఎఐకెఎస్ ఆలిండియా అధ్యక్షులు, 500 రైతు సంఘాల సంయుక్త కిసాన్ మోర్చ అగ్ర నాయకులు, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. మేధావులు, విద్యావంతులు, రైతులు, ఆక్వా రైతులు పాలొనాలని పిలుపునిచ్చారు.

బిసిల సమస్యలు పరిష్కరించాలి

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కాశి

ప్రజాశక్తి - భీమవరం

బిసిల సమస్యలు పరిష్కరించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వర్ధన పల్లి కాశి డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు నిర్ధారించకుండా స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహిస్తే బిసిలకు నష్టం జరుగుతుందని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి బిసిలకు న్యాయం చేయాలని కోరారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపుమేరకు జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెసి రాహుల్ కుమార్ రెడ్డికి, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణకు, బిజెపి జిల్లా అధ్యక్షులు అయినంపూడి శ్రీదేవికి వినతిపత్రాలు అందజేశారు. కాశి మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్ల అంశం నిర్ధారణ కాకుండానే ఎన్నికలు నిర్వహిస్తే జనాభాలో 56 శాంతం ఉన్న బిసిలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. తెలంగాణ హైకోర్టు 42 శాతం రిజర్వేషన్లపై స్టే ఆర్డర్ ఇచ్చిందని, దానిలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించిందని తెలిపారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్, కేశవభట్ల విజయ్, అత్తిలి బాబి, మారిశెట్టి నరసింహమూర్తి, సందక రమణ, పిన్నింటి రామకృష్ణ, చిక్కాల చందు, వెంకటేశ్వరరావు, వెంకటరావు, దుర్గారావు, అప్పన్న, పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం అందజేస్తున్న బిసి సంక్షేమ సంఘం నేతలు

కోతులు, కుక్కలు, ఆవుల నుంచి కాపాడాలి

మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - తణుకు

తణుకులో విపరీతంగా పెరిగిపోయిన కోతులు, కుక్కలు, ఆవుల బారి నుంచి ప్రజలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయ కుమారి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టణంలోని అన్ని విధుల్లో కోతులు, కుక్కలు, ఆవులు పెద్ద సంఖ్యలో ఉండడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు, పిల్లలు రోజూ ఏదో పక్క కుక్కకాటుకు గురౌతున్నారన్నారు. బయట రావాలంటే ప్రజలు భయపడుతున్నారని తెలిపారు. ప్రతి వీధిలో సుమారు 10 నుంచి 15 కుక్కలు ఉంటున్నాయన్నారు. మూగ జీవాలు ప్రజల ప్రాణాలు తీయడం, దాడి చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్టు ఉండడం ఎంతవరకు సమంజసమన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ టి.రామ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, పి.శేషవేణి, శారద, ఎం.గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్ రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

చించినాడ పోరాట నేత కేతా నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడ పోరాట నాయకుడు కేతా నాగేశ్వరరావు (89) సోమవారం ఉదయం వృద్ధాప్య కారణాలతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా నెలరోజుల కిందటే పెద్ద కుమారుడు రిటైర్డ్ ఎస్ఐ సత్యనారాయణ మృతి చెందారు. చిన్న కుమారుడు వాసు ఉన్నారు. నాగేశ్వరరావు సిపిఎం సీనియర్ నేత, చించినాడ మాజీ సర్పంచి, మాజీ సొసైటీ అధ్యక్షులు కేతా సూర్యారావుకు స్వయానా సోదరుడు. 1977 - 80 మధ్య చించినాడలో పేదలకు, భూస్వాములకు మధ్య జరిగిన మహా పోరాటంలో నాగేశ్వరరావు తన అన్న సూర్యారావు ఇతర మిత్రులతో కలిసి అనేక పోరాటాల్లో పాల్గొనడంతో అప్పటి భూస్వాములు, పోలీసులు కలిసి నాగేశ్వరరావుపై రెండు హత్యాయత్నం కేసులతో సహా 35 ఇతర కేసులు నమోదు చేశారు. హత్యాయత్నం కేసుల్లో నాగేశ్వరరావు సుమారు 6 నెలల పాటు రిమాండ్ ఖైదీగా ఉండడంతో పాటు అనేక నెలలు అజ్ఞాతవాసం గడిపారు. ఆ సమయంలో ఆయన ఎన్ని నిర్బంధాలను, ఆటుపోట్లను ఎదుర్కొన్నా పేదల పక్షాన పోరాటం చేయడంలో వెనుదిరిగి చూడకుండా ప్రతి పోరాటంలోనూ ఎంతో చైతన్యంతో పాల్గొని అనేక మందికి ఆదర్శంగా నిలిచారు. నాగేశ్వరరావు మృతి వార్త తెలియగానే ఆయన సోదరుడు సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మండల కమిటీ సభ్యులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, తెన్నేటి నాగరాజు, చెల్లుబోయిన వడ్డి కాసులు, స్థానిక నాయకులు, చెల్లిబోయిన నరసింహమూర్తి, బొల్లా నరసింహమూర్తి, ముమ్మిడివరపు ఆంజనేయులు, మల్లుల పుల్లారావు, శెట్టిమి భాస్కరరావు, పల్లేరు వెంకటస్వామి, తెన్నేటి శివాజీ, తాడి ఉదయ్, మురాల రాజేష్, ఆకుమర్తి ఏసు రత్నం తదితరులు నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు.

నాగేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

నాగేశ్వరరావు మృతికి పలువురి సంతాపం

కేతా నాగేశ్వరరావు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, ఆచంట మాజీ ఎంఎల్‌ఏ దిగుపాటి రాజగోపాల్, జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తదితరులు సంతాపం తెలిపారు.

చంద్రబాబు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - పెంటపాడు

విశాఖ ఉక్కు కార్మికులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, నాయకులు చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నష్టాలు రావడానికి కార్మికులే కారణమని, కార్మికులు పనిచేయక ఇంటి వద్ద ఉండి సోమరిపోతుల్లా జీతాలు తీసుకోవడం వల్లే స్టీల్ ప్లాంట్‌కు ఈ పరిస్థితి వచ్చిందని చంద్రబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడడం బాధాకరమని, దీన్ని సిపిఎం ఖండిస్తోందని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ఏర్పడటానికి పెద్ద ఎత్తున పోరాటాలు ఉద్యమాలు జరిగాయని, 32 మంది బలిదానంతో అప్పుడున్న వామపక్ష ఎంపీలు, ఎంఎల్ఎల రాజీనామాలతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి ఐదు కోట్ల పెట్టుబడితో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ, దత్తు రాము, సత్తి శివారెడ్డి, గంటా కోటి, బర్ల బాలాజీ, మాదాసు రాజు, పూడి బాలాజీ, చిట్టియా ఆనంద్, వెంకటేశ్వరరావు అప్పల ప్రభాకర్ పాల్గొన్నారు.

సిఐటియు అఖిల భారత, జిల్లా మహాసభ జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

సిఐటియు అఖిల భారత, జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లిగూడెం అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం స్థానిక అపరాల కార్యాలయంలో చుక్కా అప్పలస్వామి భవనంలో చిటికిన రాము అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా కార్మిక జిల్లా నేత అమరజీవి చింతకాయల బాబూరావు చిత్రపటానికి కర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిల భారత మహాసభలు, ఈనెల 29, 30 తేదీల్లో పెనుగొండలో సిఐటియు జిల్లా మహాసభలు జరుగుతాయని, జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సమావేశానికి సిఐటియు పట్టణ కన్వీనర్ జవ్వాది శ్రీను, చిటికిన రాము, అయినాల సత్యనారాయణ, అడపా లోవ, యడ్ల శ్రీను, దాసరి రాజు, సుందరపు అప్పలనాయుడు, వెదుళ్ల రమణారావు, రౌతు పాపినాయుడు, ఇల్ల గోవిందరావు, పెంటకోట గోవింద, బద్ది నాగేశ్వరరావు, చిట్టేటి సత్యనారాయణ, బుద్దాల తాతారావు, అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డిడిఎం

ప్రజాశక్తి – పాలకోడేరు

మాట్లాడుతున్న నాబార్డ్ డిడిఎం సురేంద్ర

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నాబార్డ్ డిడిఎం సురేంద్ర సూచించారు. పాలకోడేరు సొసైటీలో సోమవారం ఫైనాన్షియల్ అండ్ డిజిటల్ లిటరసీ(ఎఫ్‌డిఎల్ఎస్) క్యాంపును సొసైటీ చైర్మన్ కొత్తపల్లి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ టెక్నాలజీ యుగంలో ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. అనవసరమైన యాప్‌లలో మన డేటా మొత్తం చోరీకి గురవుతుందన్నారు. స్క్రీన్ షేరింగ్ యాప్ లు, విషింగ్ కాల్స్, ఎటిఎం కార్డు స్కిమ్మింగ్, క్యూఆర్ కోడ్ స్కాన్ వంటి వాటి వల్ల అనేక మోసాలు జరుగుతున్నాయన్నారు. దీని పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సొసైటీ అధ్యక్షులు నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో డిసిసిబి మేనేజర్ దుర్గారావు, ఏలూరు డిసిసిబి పిడి సెల్ బాలకృష్ణ, సొసైటీ కార్యనిర్వహణాధికారి పెనుమత్స నరసింహరాజు పాల్గొన్నారు.

పిప్పర మార్గంలో భారీ వాహనాల రాకపోకలు నిలుపుదల

ఒకటి నుంచి అమలు : జిల్లా ఆర్అండ్‌బి అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి – భీమవరం

భీమవరం – పిప్పర రహదారిలో డిసెంబర్ ఒకటో తేదీ నుంచి భారీ వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా రహదారులు, భవనాల శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమవరం – పిప్పర రహదారిలో ఉండి కాలువపై ఉన్న గరగపర్రు వంతెన శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ నేపథ్యంలో భారీ వాహనాల రాకపోకలు నిషేధించడం జరిగిందన్నారు. భారీ వాహనదారులు భీమవరం నుండి తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం నుండి భీమవరం ప్రయాణించేందుకు ప్రత్యామ్నాయ రహదారులు వినియోగించుకోవాలని కోరారు. ఉండి నుండి గణపవరం, పిప్పర మీదుగా తాడేపల్లిగూడెం, పాలకోడేరు, అత్తిలి, పిప్పర మీదుగా తాడేపల్లిగూడెం, పిప్పర నుండి గణపవరం, ఉండి మీదుగా భీమవరం, పిప్పర నుండి అత్తిలి మీదుగా భీమవరం ప్రయాణించవచ్చున్నారు.

డిగ్రీ కళాశాలలో సెమినార్

పాలకొల్లు : పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వాణిజ్య విభాగం, ఐక్యూ ఎసి, ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ తరుపున కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. విజయవంతమైన ఆవిష్కరణలు, వ్యవస్థాపకులు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా పాలకొల్లు పట్టణ టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు గాదె సుబ్బారావు విచ్చేసి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగడానికి మెలకువలను వివరించారు. టి.కృష్ణ ఐసిఐ ప్రెసిడెంట్, డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఇన్‌ఛార్జి, కె.భద్రాచలం ఐఐసి వైస్ ప్రెసిడెంట్, డాక్టర్ ఎం.రామకృష్ణ ఐఐసి కన్వీనర్, డాక్టర్ వి.విజయలక్ష్మి ఐఐసి మెంబర్, డాక్టర్ వి.యామిని అకాడమిక్ కోఆర్డినేటర్, డాక్టర్ బూసి వెంకటస్వామి, వాణిజ్య అధ్యాపకులు పి.దుర్గేశ్వరి, బి.ఆశాజ్యోతి పాల్గొన్నారు.

రెండు వేల సంతకాలు సేకరణ

పెనుమంట్ర : రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల స్పందనను ప్రభుత్వానికి తెలియజేసే విధంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా స్థానికంగా ప్రజల నుండి రెండు వేల సంతకాలు సేకరించినట్లు వైసిపి నాయకులు సోమవారం ఇక్కడ తెలిపారు. పెనుమంట్ర గ్రామంలో స్థానిక గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉపసర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, వైసిపి గ్రామ అధ్యక్షులు తేతలి సుధీర్ రెడ్డి, ఎంపిటిసి గండి రాము, తదితరుల సహకారంతో సేకరించినట్లు తెలిపారు.

సాయి గణేష్ మృతదేహం లభ్యం

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. ఈనెల 23వ తేదీన ఆదివారం ఏలూరు జిల్లా ఏలూరులోని కొత్తపేటకు చెందిన మునగాల మోహన సాయి గణేష్(19) తన ఇంటి సమీపంలోని ముగ్గురు స్నేహితులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో సముద్ర అలల్లో స్నానం చేస్తూ అలల ఉధృతికి లోపలకు కొట్టుకుపోయి గల్లంతైన విషయం పాఠకులకు విధితమే. కొట్టుకుపోయి గల్లంతైన సాయి గణేష్ కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు గాలించగా గణేష్ మృతదేహం పేరుపాలెం సౌత్‌లోని మొల్లపర్రు బీచ్‌లో సోమవారం ఉదయం లభ్యమైందని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సాయి గణేష్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

పోలీసుల దర్యాప్తు

నరసాపురం: పట్టణంలో తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. గత కొంత కాలంగా ఈ చోరీలు ఆగినా.. మళ్లీ ఆదివారం రాత్రి రెండు ఇళ్లల్లో వరుస చోరీలు జరిగాయి. పట్టణంలోని జ్యోషుల వారి వీధిలోని తులసీ ఆస్పత్రికి ఎదురుగా ఉంటున్న ఇంట్లో సిహెచ్.సుబ్బలక్ష్మి నివాసం ఉంటుంది. సుబ్బలక్ష్మి ఈనెల 20న కుమారుడు వద్దకు హైదరాబాద్ వెళ్లింది. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు ఆమెకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమెకు పోలీసులు ఫోన్లో సమాచారం ఇచ్చారు. దీన్ని దర్యాప్తు చేస్తున్న సమయంలోనే సిద్ధాని వారి వీధిలో సిద్ధాని శ్రీనివాస్ యాత్ర నిమిత్తం ఉత్తర భారతదేశం వెళ్లారు. తాళాన్ని పగలగొట్టి చోరీ చేశారు. ఉదయం తలుపు తీసి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఇళ్లను పట్టణ సిఐ యాదగిరి, సిబ్బంది పరిశీలించారు. అయితే సుబ్బలక్ష్మి ఇంటో ఏమి పోలేదని సిఐ చెప్పారు. శ్రీనివాస్ మాత్రం యాత్రలో ఉన్నందున్న ఏమేరకు పోయిందన్న విషయాన్ని ఫిర్యాదు చేయలేదన్నారు. ఇటు క్లూస్ టీమ్‌ను రప్పించి దొంగల కోసం దర్యాప్తు చేస్తున్నారు. పరిసరాల సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు.

శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోండి

- పలచని దుస్తులు ధరించాలి
- విటమిన్ సి ఉన్న పండ్లు తీసుకోవాలి
- ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ వై.మౌనిక

ప్రజాశక్తి – ఐరగవరం



శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలని, పెద్ద దుస్తుల కంటే పలచని పొరలుగా దుస్తులు వేసుకోవడం మంచిదని ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ వై.మౌనిక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ శీతాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పలచని దుస్తులు ధరించి, చెవులు, చేతులు, కాళ్ల తప్పకుండా కప్పుకోవాలన్నారు. రాత్రిళ్లు వెచ్చని దుప్పట్లు, సాక్స్ ఉపయోగించాలన్నారు. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలని, విటమిన్ సి ఉన్న పండ్లు.. నారింజ, ఉసిరి, జామ, నిమ్మకాయ తీసుకోవడం మంచిదన్నారు. సూపులు, దాల్ వంటి వెచ్చని ఇంటి ఆహారం తినాలన్నారు. అల్లం, పసుపు, మిరియాలు, వెల్లుల్లి వంటి పొడులు, దినుసులు ఆహారంలో చేర్చాలని తెలిపారు.

చర్మాన్ని రక్షించుకోండి ఇలా..

రోజూ మాయిశ్చరైజర్ రాయాలని, చిట్లిపోయే పెదవులకు లిప్ బామ్ ఉపయోగించాలన్నారు. శీతాకాలంలో కూడా సన్‌స్క్రీన్ వేసుకోవడం మంచిదన్నారు.

చురుగ్గా ఉండడానికి రోజూ కొంచెం సేపు వ్యాయామం చేయాలన్నారు. సూర్యరశ్మి ఎక్కువగా ఉన్న సమయంలో బయట నడవాలని, వ్యాయామం రక్తప్రసరణ, రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుందని తెలిపారు.

సంక్రమణల నివారణకు తరచూ చేతులు కడుగుకోవడం అలవాటు చేసుకోవాలని, జలుబు ఉన్నవారి దగ్గరికి వెళ్లడం తగ్గించాలని, గదిని గాలి పారేలా ఉంచాలని సూచించారు.

శ్వాస సంబంధ సమస్యల నివారణకు దుమ్ము అలర్జీ ఉంటే మాస్క్ వేసుకోవాలని, గదిలో హ్యూమిడిఫైయర్ లేదా నీళ్ల గిన్నె ఉంచాలని, గొంతు బిగించినప్పుడు ఆవిరి పీల్చడం మంచిదని తెలిపారు.

సరైన నిద్ర అవసరం..

రోజుకు 7–8 గంటల నిద్ర తీసుకోవడం మంచిదని, శీతాకాలంలో శరీరానికి ఎక్కువ విశ్రాంతి అవసరమని తెలిపారు.

పిల్లలు, వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎప్పుడూ వెచ్చని దుస్తులు వేసుకోవాలని, వారికి సూపులు, వెచ్చని నీళ్లు, పోషకాహారం ఇవ్వాలని, డాక్టర్ సూచిస్తే ఫ్లూ వ్యాక్సిన్ వేయించాలని తెలియజేశారు.

చల్లని నీరు నివారించి, స్నానానికి గోరువెచ్చని నీరు ఉపయోగించాలన్నారు. చాలా చల్లటి నీరు తాగితే జలుబు, గొంతు నొప్పి రావచ్చునని తెలిపారు. రోజు మొత్తం నీళ్లు తాగడం మర్చిపోవద్దని, శీతాకాలంలో దాహం తక్కువగా అనిపించినా శరీరానికి నీరు అవసరమన్నారు. గోరువెచ్చని నీరు చిన్న చిన్న మోతాదుల్లో తాగాలని సూచించారు.

కెనరా బ్యాంక్ సహకారం మరువలేనిది

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి – ఉండి

నియోజకవర్గంలో మైక్రో ఫిల్టర్ల ఏర్పాటుకు కెనరా బ్యాంక్ ఇచ్చిన సహకారం మరువలేనిదని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం మండలంలోని కలిసిపూడి, చిలుకూరు గ్రామాల్లో మైక్రో ఫిల్టర్‌లను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 70 గ్రామాల్లో ఇప్పటికే 65 గ్రామాల్లో మైక్రో ఫిల్టర్‌లను ఏర్పాటు చేశామని, అందులో 25 మైక్రో ఫిల్టర్‌లను కెనరా బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మైక్రో ఫిల్టర్ల ద్వారా గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన శుద్ధ జలాలను ఇవ్వడం జరుగుతుందని, దీనివల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మైక్రో ఫిల్టర్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మైక్రో ఫిల్టర్ల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలు తీసుకుని విధిగా ఫిల్టర్ చేయాలని, అప్పుడే ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందుతుందన్నారు. ఈ నిర్వహణలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రెండు దశాబ్దాల కోపల్లె వంతెన సమస్య తీరిందని, త్వరలోనే రూ.12 కోట్ల వ్యయంతో నాలుగు లైన్ల రహదారి ఉండే విధంగా బ్రిడ్జిని నిర్మించి వేసవిలో పూర్తి చేస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో కలిసిపూడి గ్రామ సర్పంచి కేసబోయిన జానకి శ్రీనివాస్, ఉపసర్పంచి మంతెన చంటిరాజు, ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు, చిలుకూరు గ్రామ సర్పంచి ముదునూరి వెంకట సోమరాజు, కలిసిపూడి గ్రామ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, చిలుకూరు గ్రామ అధ్యక్షులు వేగేశ్న సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

నీటిని మహిళలకు అందజేస్తున్న రఘురామకృష్ణరాజు

ఆక్వా రైతుల అభివృద్ధికి సహకరించండి

నాణ్యమైన మేతలను అందిస్తూ ఆక్వా రైతుల అభివృద్ధికి సహకరించాలని కార్తికేయ ఏజెన్సీస్ యాజమాన్యానికి డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు సూచించారు. సోమవారం మండలంలోని చిలుకూరు గ్రామంలో రుద్రరాజు రామకృష్ణంరాజు, పెన్మెత్స భీమరాజులచే నూతనంగా ఏర్పాటు చేసిన కార్తికేయ ఆక్వా ఏజెన్సీస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతుల అభివృద్ధికి దుకాణదారులు సహకరించాలని, నాణ్యమైన మేతలను అందించాలన్నారు. అదేవిధంగా రైతులు కార్తికేయ ఏజెన్సీస్ వారు అందించే అన్ని సౌలభ్యాలను పొందాలని వారు సూచించారు. చిలుకూరు మారుమూల ప్రాంతం కావడంతో నీటి నాణ్యతను, సాయిల్ టెస్ట్ చేయించుకోవడానికి భీమవరం వెళ్లాల్సి వచ్చేదని, కానీ నేడు వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కార్తికేయ ఏజెన్సీస్ వారు జెనెటిక్ ఆక్వా ల్యాబ్‌ను గ్రామంలోనే అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారని, ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టిడిపి గ్రామ అధ్యక్షులు వేగేశ్న సత్యనారాయణ రాజు, గ్రామ సర్పంచి ముదునూరి వెంకట సోమరాజు, స్థానికులు రుద్రరాజు బలరామరాజు, రుద్రరాజు శివ, ఇందుకూరి నవీన్ వర్మ పాల్గొన్నారు.

అప్పారావు ఆశయ సాధనకు కృషి

సిపిఎం నేత జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి – వీరవాసరం

కమ్యూనిస్టు కార్యకర్త కిలాడి అప్పారావు ఆశయ సాధన కోసం గట్టి కృషిచేయాలని సిపిఎం సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. సోమవారం ఉత్తరపాలెం బిసి కమ్యూనిటీ హాల్‌లో యాళ్ల బండి నారాయణమూర్తి అధ్యక్షతన కిలాడి అప్పారావు ఐదవ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా కిలాడి అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో నరసింహమూర్తి, ఆకుల హరేరాం మాట్లాడుతూ జీవనోపాధిని చూసుకుంటూ పార్టీ కోసం అవిశ్రాంతంగా కష్టపడ్డారని, ఉత్తర పాలెం ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యల మీద నిరంతరం ఆందోళన పోరాటాలు నిర్వహించేవారని అన్నారు. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ప్రజలకు సుపరిచితులుగా ఉండేవారన్నారు. ప్రజల కోసం పనిచేసే వారికి ఎప్పటికీ మరణం ఉండదని తెలిపారు. అయినంపూడి బాబురావు, పాల అజయ్‌ఘోష్, మైగాపుల త్రిమూర్తులు, పాల చక్రధర్‌రావు, అప్పారావు కుమారులు శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు

ప్రజాశక్తి – గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన సోమవారం కొత్తపల్లిలో గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ అధ్యాపకులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇంటి పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.వెంకటరమణ, ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి, లెక్షరర్లు పాల్గొన్నారు.

ఘనంగా షష్టి ఉత్సవాలు

రేపు అఖండ అన్న సమారాధన : డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ

ప్రజాశక్తి – నరసాపురం

మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో వేంచేసియున్న శ్రీదుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 25, 26వ తేదీల్లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్న) తెలిపారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఈనెల 25వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటల నుండి చాగంటి మురళీకృష్ణ, శ్రీదేవి దంపతులచే శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26న బుధవారం ఉదయం నుండి ఆలయ ప్రాంగణంలో చాగంటి ఉమా ఆనందరావు(ఉమానాయుడు) జ్ఞాపకార్థం వారి కుమారులు డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న), లక్ష్మణేశ్వరం సొసైటీ చైర్మన్ చాగంటి పార్థసారధి ఆధ్వర్యాన అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం ప్రముఖ సినీ గాయని ఇంద్రావతి(మంగ్లీ చెల్లి)చే, కోనసీమ జిల్లా, అంబాజీ పేట వాస్తవ్యులు, సంగీత సర్వనిధి నేషనల్ అవార్డు గ్రహీత, రాజేష్ గురుస్వామిచే శ్రీవిజయ దుర్గ అయ్యప్ప భజన జరుగుతుందన్నారు. షష్టి వేడుకల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని, ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

ఆకివీడు : ఈనెల 25వ తేదీ సాయంత్రం నుండి ప్రారంభమై మూడు రోజుల పాటు సాగే సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాలకు ప్రజానీకానికి, భక్తులకు ఏవిధమైన అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా సరియైన నిబంధనలు పాటించాలని దేవస్థాన నిర్వాహకులకు దేవాదాయ శాఖ అధికారులు సూచించారు. క్యూ లైన్‌లకు ఇబ్బందులు లేకుండా చూడాలని, లైన్‌లో మంచినీరు ఉంచాలని సూచించారు. తోపులాటలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

కొడుకు ఇంటి నుండి పొమ్మంటున్నాడు

పిజిఆర్ఎస్‌లో తల్లి ఆవేదన : ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి – నరసాపురం

తన కొడుకు ఇంటి నుండి వెళ్లిపోమంటున్నాడని ఓ తల్లి నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజుకు ఫిర్యాదు చేసింది. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి కొల్లాటి సత్యవతి(70) భర్త కృష్ణమూర్తి రెండేళ్ల క్రితం చనిపోయారు. వీళ్లకి ముగ్గురు కూతుర్లు, కొడుకు మోహన్ రావు ఉన్నారు. కొడుకు మోహన్ రావు తనకు ఆహారం పెట్టడం లేదని, తన కూతుర్లు వచ్చి కొద్దిరోజులు వంతుల వారీగా ఆహారం పెడుతున్నారన్నారు. గ్రామంలో టిఫిన్ హోటల్ ద్వారా ఎంతో మంది ఆకలి తీర్చిన తనకి ఆహారం కరువైందన్నారు. తాను పక్షవాతమై కొడుకు పట్టించుకోవడం లేదని, ఇప్పటికే వైద్యానికి అప్పు చేసి జీవిస్తున్నట్లు తెలిపారు. తన వైద్య ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందిగా ఉందన్నారు. తన భర్తకు వచ్చే పెన్షన్ సొమ్ముతో జీవించే వాళ్లమని, తన భర్త చనిపోయినప్పటి నుండి ప్రభుత్వం నుండి పెన్షన్ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసిరాజుకు వినతి పత్రం అందించారు. ఆమె రాకను సిబ్బంది ద్వారా తెలుసుకున్న ఆర్‌డిఒ దాసిరాజు పిజిఆర్ఎస్ నుండి బయటకు వచ్చి ఆమె ఫిర్యాదును స్వీకరించారు. ఆమె ధైర్యంగా ఉండాలని, ఫిర్యాదుపై విచారణ చేపట్టి న్యాయం చేస్తానని తెలిపారు.

నిర్దేశిత గడువులోగా ఫిర్యాదుల పరిష్కారం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి – నరసాపురం

పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 37 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఒక వినతి అందిందని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. మండలంలోని కొత్త గ్రామానికి చెందిన భూస్వామి తన భూమికి సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరుతూ వినతి ఇచ్చారని తెలిపారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్‌లో నాలుగు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో రెండు, రెవెన్యూ విభాగంలో ఒకటి, శానిటేషన్ విభాగంలో ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు.

CHANGE OF NAME

I, **KUDIPUDI BALA KRISHNA, S/o KUDIPUDI MOHANA RAO** and **KUDIPUDI NAGAMANI** (new name), residing at D.No 8-48, BHUPAIAH CHERUVU, JINNURU, PODURU Mandal, W.G Dt., A.P changed my name **KUDUPUDI BALAKRISHNA, S/o KUDUPUDI MOHANA RAO** and **KUDUPUDI NAGAMANI** (old name) to **KUDIPUDI BALA KRISHNA, S/o KUDIPUDI MOHANA RAO** and **KUDIPUDI NAGAMANI** (new name). Henceforth, all my documents, Passport etc. will be continued with my new name shall henceforth be known as **KUDIPUDI BALAKRISHNA**.

టెన్త్ ఒరిజినల్ మార్క్ లిస్ట్ పోయినది

నేను 10-11-2025 సంవత్సరంలో మా ఇంటి వద్ద నుండి పోలవరం లో ఉన్న జిరాక్స్ షాప్ కి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో నా యొక్క టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ (ఒరిజినల్) జిరాక్స్ తీసుకుని నా బండి సైడ్ కవర్లో పెట్టుకొని ఇంటి వద్ద కు వచ్చుచుండగా టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ నెంబర్: **SS156913** నెంబర్ గల మార్క్ లిస్ట్ మార్గమధ్యలో పడిపోయినది. కావున ఎవరికైనా దొరికిన ఎడల దయచేసి ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కురుమళ్ళ అర్చన, కేరాఫ్ నాగరాజు
ఇంటి నెం.4-124, కమ్మరగూడెం,
పోలవరం మండలం, పిన్కోడ్ 534 315,
ఏలూరు జిల్లా, ఎ.పి., సెల్: 6309255279

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, అమ్మపాలెం గ్రామమునకు చెందిన వీరంకి మురళీ గారి భార్య వీరంకి భాగ్యలక్ష్మి తెలియచేయునది ఏమనగా ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, వట్లూరు గ్రామములో జిరాయితీ పల్లం ఆర్.యస్.నెం.24/8 య.0.61 సెంట్లు మరియు ఆర్.యస్.నెం.24/9 య.0.61 సెంట్లు వెరశి య.1.22 సెంట్లు భూమిని మా ముత్తాత గారు అయిన పరసా శ్రీరాములుగారు డాక్యుమెంట్ నెం.3686/1948 మరియు డాక్యుమెంటు నెం.1315/1952 లు వేలేటి కృష్ణందాసు గారు కుమారుడు స్వామియేలు వగైరాలు వలన మరియు చవాకుల సిక్కమ్మ వగైరాల ద్వారా కొనుగోలు చేసియున్నారు. సదరు ఒరిజినల్ దస్తావేజులను E.C తీసుకొను నిమిత్తము ది.10-11-2025వ తేదీన వట్లూరు రిజిష్టరు ఆఫీసుకు తీసుకుపోవునప్పుడు మార్గ మధ్యములో వట్లూరు గ్రామములో సదరు దస్తావేజుల గల సంచి పడిపోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు. సదరు దస్తావేజులు ఎవరైన దుర్వినియోగం చేసిన యెడల వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

వీరంకి భాగ్యలక్ష్మి, భర్త వీరంకి మురళి
ఏలూరు అమ్మపాలెం, పెదవేగి మండలం,
తేది.22-11-2025 ఏలూరు జిల్లా.

మహారాజశ్రీ భీమవరం 1st Addl, సివిల్ జడ్జి (Jr D) వారి కోర్టులో

O.S.No.51/2025

వాది: పాలా వెంకట సుబ్బారావు
ప్రతివాద్లు : పాలా పెద్దిరాజు వగైరా
1వ ప్రతివాది : పాలా పెద్దిరాజు,
S/o.వెంకటేశ్వరరావు, R/o.D.No.4-28,
గొరగనమూడిపాలెం, గొరగనమూడి,
పాలకోడేరు మండలం.

పై నెంబరు దావాలో వాది, 1వ ప్రతివాది అయ్ని మీకు దావా సమన్లు కోర్టు ద్వారాను పోస్టు ద్వారాను 2,3 పర్యాయములు జారీ చేయించినప్పటికి 1వ ప్రతివాది అయ్ని మీరు సదరు దావా సమన్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. పైనెంబరు దావాలో 1వ ప్రతివాది అయ్ని మీ హాజరు నిమిత్తం పైదావాను ది.16.12.2025 సం॥రం తేదీన వాయిదా వేసినారు. 1వ ప్రతివాది అయ్ని మీరు సదరు వాయిదా తేదీ ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియ చేసుకోవలెను. లేనియడల పైనెంబరు దావాలోను సదరు వాయిదా తేదీని 1వ ప్రతివాది అయ్ని మీ పరోక్షమందు తీర్మానించడమగును.

ఎం.వి.వి.శివసత్యనారాయణ
వాది తరుపున అడ్వకేటు, భీమవరం.
సెల్: 9949345699

నేడు ఛాంబర్స్‌లో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి – పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పిజి కళాశాలలో ఈనెల 25న ఉదయం 10 గంటలకు టెక్నో యాన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించబడునని కళాశాల చైర్మన్ కె.వి.నరసింహారావు తెలిపారు. ఛాంబర్స్ కళాశాల విద్యతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముందుంటుందన్నారు. బిఎస్‌సి లేదా బిసిఎ, ఎంసిఎ లేదా ఎంబిఎ చేసిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9912046234, 9849712739 నెంబర్లలో సంప్రదించవచ్చునని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

CHANGE OF NAME

I, **KADALI RAMA PRASAD** (new name) residing at D.No.3-131/2, Kothapeta, H/o. Digamarru village, Palakol Mandal, W.G.Dist., A.P. Changed my name **KOLLETI RAMA PRASAD CHETTI** (old name) to **KADALI RAMA PRASAD** (new name) and my father name **K. RAMACHETTI** (old name) to **KADALI RAM SETTI** (new name) hence forth all my documents Passport etc will be continued with my new name shall henceforth be known as my name **KADALI RAMA PRASAD** and my father name **KADALI RAM SETTI**.

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.894/2025 in O.S.No.421/2025

Between:
G.V.V.Satyanarayana Gupta
మరియు ...వాది/పిటిషనర్
Bajaj Finance Ltd and 4 Others
...ప్రతివాదులు/రెస్పాండెంట్లు

5వ ప్రతివాదికి/రెస్పాండెంట్‌కి నోటీసులు

అడ్రస్సు: RBL Bank of Tanuku Branch, D.No.26/6/15, 1st Floor Sri Matha Towers, Opp.Kummarla Street, Rajiv Chowk, Velpur Road, Tanuku, W.G.Dist-534211.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ననుసరించి పైనెంబరు గ్రంథములో I.A.No.894/2025 in O.S.No.421/2025లో మీలో 5వ ప్రతివాది/రెస్పాండెంట్ అయిన RBL Bank of Tanuku Branch వారు మరియు ఇతర నాలుగు బ్యాంకులు వాది అయిన G.V.V.Satyanarayana Gupta తన ఇంటికి ప్రతివాది సంస్థ ప్రతినిధులు మరియు ఏజంట్లు రాకుండా Temporary మరియు Perminant Injuction కోసం దావా దఖలు చేసిన విషయంలో ప్రతివాది నెం.5 అయిన వారికి సాధారణ మరియు అర్జెంట్ సమన్లు అందకపోవడంతో ఈ పబ్లికేషన్ ద్వారా నోటీసు ఇవ్వడమైనది. ప్రతివాది నెం.5 ది.15-12-2025 ఉదయం 10.30 గంటలకు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తణుకు వారి ఎదుట స్వయంగా గాని, తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదనలు తెలియజేయవలెను. హాజరు కాని పక్షంలో మీ పరోక్షంలో విచారించబడును.

B.N.V.Ganesh
Tanuku **O.S.Nageswararao**
Dt.24-11-2025 Advocates, Tanuku.

ప్రకటన

మహారాజశ్రీ మచిలీపట్నం పదవ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో

F.D.I.A.226/2024 in O.S.28/2021

పిటీషనరు/వాది :
సుందర ఈశ్వర వెంకట దుర్గారావు
Vs
రెస్పాండెంటు/ప్రతివాద్లు :
1.మంగదొడ్డి సురేంద్ర
2.మంగదొడ్డి రేవతి
To.
1.మంగదొడ్డి సురేంద్ర, S/o.మాధవరావు
2.మంగదొడ్డి రేవతి, W/o.సురేంద్ర
భీమవరం, కో-ఆపరేటివ్ ఎస్టేట్స్ మరొక్క అడ్రస్సు డోరునెం. 19-22-5/1A కాపు కళ్యాణ మండపం వీధి, 26వ వార్డు, బ్యాంకు కాలనీ, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

రెస్పాండెంట్లకు పై నెంబరు FD పిటిషన్‌లో కోర్టు వారు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినప్పటికిన్ని మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు FD పిటిషనులో నోటీసులు అమలు జరుపు నిమిత్తం యీ పేపరు ప్రకటన ద్వారా అమలు జర్పడమైనది. కాబట్టి ది.17-12-2025 సం॥రం ఉ.10.30లకు పై కోర్టులో మీరు స్వయముగా గాని అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క వాదనను దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.

By Order of Court

గునిశెట్టి శ్రీనివాసరావు
బోగిరెడ్డి వెంకన్నబాబు
అడ్వకేట్లు, మచిలీపట్నం
మచిలీపట్నం సెల్: 9553126234
తేది.23-11-2025 9909009916

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.ఎస్.నెం.502/2023

బిట్వీన్ :
1.బేతాళ వేణుగోపాలకృష్ణ రాజు వగైరాలు ...వాద్లు
మరియు
1.వేగేశ్న వేణుగోపాలకృష్ణరాజు వగైరాలు ...ప్రతివాద్లు
టు
వేగేశ్న రామరాజు, తండ్రి వేణుగోపాలకృష్ణ రాజు, డోర్‌నెం.6-1, తేతలి గ్రామం, తణుకు మండలం, ప.గో.జిల్లా. ...2వ ప్రతివాది

వాది తరుపున దాఖలు చేసిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంథంలో 2వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు శ్రీకోర్టు ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు పంపించినను, అవి మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పైకోర్టు వారి ఎదుట ఈ పబ్లికేషన్ తేది నుండి 30 రోజులలోగా పైకోర్టు వారి ఎదుట పై నెంబరు దావాలోను అనగా ఓ.ఎస్.502/2023 మరియు సదరు దావాలోని ఐ.ఎ.నెం.1120/2023 మరియు 1121/2023 పిటిషన్‌లో పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గం॥లకు అనగా ఈ పబ్లికేషన్ నుండి 30 రోజులలోగా మీరు స్వయంగా కానీ మీ తరపు ప్లీడరు గారి ద్వారా గానీ శ్రీకోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. ఈ దావా వాయిదా 22-12-2025

ఇవటూరి కిషోర్
తణుకు వాది తరపు అడ్వకేట్
తేది.25-11-2025 సెల్: 98485 44550

పలుచోట్ల రైతన్నా మీకోసం

ప్రజాశక్తి – పాలకోడేరు

రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలను అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. పాలకోడేరు గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి లేఖను జెసి ఆవిష్కరించారు. రైతులందరికీ లేఖను అందజేశారు. రైతులను కలిసి మాట్లాడారు. రైతాంగం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీటి భద్రత ఆధారిత వ్యవసాయ సాంకేతికత వ్యవసాయం, ఆహార సంస్కరణ, ప్రభుత్వ మద్దతు అనే అంశాలపై రైతులకు వివరించారు. రైతులు మొబైల్‌లో యాప్ ఇన్‌స్టాల్ చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి నైపుణ్యాభివృద్ధితో అంచనావేసి రైతుల్లో శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యంగా ప్రభుత్వం రైతన్న ఇంటింటా మీకోసం సర్వే కార్యక్రమం చేపట్టిందన్నారు. 24వ తేదీ నుండి 29వ తేదీ వరకు జరిగే వ్యవసాయ అనుబంధ శాఖ సిబ్బందితో ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ రఘు, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, సొసైటీ సెక్రటరీ నరసింహా రాజు, పశువైద్యులు డాక్టర్ హేమ, సిబ్బంది, రైతులు ఉన్నారు.

నరసాపురం : ఎల్‌బి చర్ల గ్రామంలో సోమవారం రైతన్నా మీ కోసం–రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఆర్‌డిఒ దాసిరాజు రైతులకు స్పష్టంగా వివరించారు. కార్యక్రమంలో నరసాపురం ఎఎంసి చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, సొసైటీ అధ్యక్షులు గుబ్బల వీరస్వామి, ఎఒ జ్యోషిలా, టిడిపి గ్రామ అధ్యక్షులు కటకంశెట్టి వీర రాఘవులు పాల్గొన్నారు.

కాళ్ల : రైతుల గురించి ప్రతిష్టాత్మకంగా రైతన్నా మీ కోసం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. పెదఅమిరం గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆకివీడు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.ప్రతాప్ జీవన్, మండల వ్యవసాయాధికారి పి.రమేష్ నాయుడు, తహశీల్దార్ సుందర్ సింగ్, గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రైతన్నా మీకోసం కార్యక్రమంలో తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.గంగాధర్ రావు, మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావు సోమవారం పెద తాడేపల్లి, రామన్నగూడెం, చినతాడేపల్లి గ్రామాల్లో పర్యటించారు. వ్యవసాయ అనుబంధ అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.

పెనుమంట్ర: వ్యవసాయ రంగంలో రైతులకు ప్రభుత్వ పథకాల గురించి వ్యవసాయ శాఖ సిబ్బంది పూర్తి అవగాహన కలిగించాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆలమూరు గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతన్నా మీకోసం అనే కార్యక్రమం తనిఖీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, మండల వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప, సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆచంట : ఈనెల 29వ తేదీ వరకు ఆరు రోజులపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రైతన్నా మీకోసం అనే కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ సర్వే నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి జెడ్ బాల పాల్గొని మాట్లాడారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814